

# అమెరి'కలకలం' కథలు

## – వంగూరి చిట్టెన్ రాజు



*13*

# ఆ ఒక్కటీ అడక్కు!

ఎందుకో తెలియదు కానీ నాకు ఏ సంవత్సరం అయినా సరే, డిశంబర్ నెల రాగానే పీడ కళలు ...సారీ..కలలు వస్తాయి. అవన్నీ కూడా ఆ ఏడు నేను నా "సాహిత్య రోగం" కుదుర్చుకోడానికి తగలేసిన డబ్బు తిరిగి ఎలా సంపాదించుకోవాలా అనే అంశం మీదే! ఇలా లాభం లేదు అని మొన్న ఒక రోజు పడుకునే ముందు "ఆంజనేయ దండకం" చదువుతూ ఉంటే ఆవిడ నాకేసి చూసిన చూపుకి అర్థం నాకు తెలుసు కాబట్టి అసలు విషయం ..అనగా ఈ ఏటి సాహిత్యాదాయ లోపమూ – మంచి నీళ్ళ వలె అయిన ఖర్చూ తప్ప నాకు వస్తున్న కలా కళల –విషయం గురించి చెప్పాను. "అవునులే నీకు వచ్చేవి అన్నీ పీడ "కళ"లే అయిఉంటాయి. మంచి వాళ్ళకి వచ్చేవి మంచి కలలూ, పెడ బుద్ధులున్న వాళ్ళకి పేడ 'కళలూ" వస్తాయిట, మా బామ్మ చెప్పేది" అని నిట్టూరుస్తూ ఉంటుండి మా క్వీన్ విక్టోరియా. "అస్సలు నువ్వు పుట్టడానికి కొన్నేళ్ళ ముందే మీ బామ్మ పోయిందిగా" అని నేను అనగానే "వెధవ లా పాయింట్లు లాగకు. ఆవిడే బతికి ఉంటే ఇంత అఘాయిత్యం జరగక పోవును. అదే సుబ్బారాయుడైతేనా, ..హాయిగా...ఉద్యోగం చేసుకుంటూ. " అని స్వరం పెంచబోయింది మా ఆవిడ. నా ప్రాణాలకి ఈ సుబ్బారాయుడు "మిథునం" లో "ద్రాక్షారం సంబంధం" లాంటి వాడు. అసలు ఉన్నదో, లేదో తెలియదు కానీ అనవసరంగా నా జీవితంలోకి ప్రవేశిస్తూ చికాకు పెడుతూ ఉంటాడు అప్పుడప్పుడు.

ఎప్పుడయితే సుబ్బారాయుడి ప్రస్తావన వచ్చిందో అప్పుడే ఇక టాపిక్ అర్జంటుగా మార్చెయ్యాలనియూ, నా అసలు సమస్యకి "ఇంట గెలిచి రచ్చ గెలవ వలెను" అని ఆర్యోక్తి కదా అనియూ అరక్షణంలో స్ట్రాటెజీ మార్చేసి, అసలు విషయం పూర్తిగా ఒప్పేసుకుని అని ఆవిడ కేసి 'ఇదిగా" చూస్తూ "అది" అడిగాను. అంతే! "ఆ ఒక్కటీ అడక్కు" అని రుసరుస లాడుతూ నా పక్కనుంచి...అనగా

పడుకునే పక్కనుంచి కానే కాదు...సోఫాలో నా పక్కనే కూచున్న పక్కనుంచి లేచి నుంచుని, లాగి కొట్టిన చెంప దెబ్బకీ, తెలుగు మేష్టారు కొట్టే టెంకి జెల్లకీ తేడా తెలియని స్థాయిలో ఒకే ఒక కొట్టుడు కొట్టి అర్ధరాత్రి వర్క్ కి వెళ్ళి పోయింది మా క్వీన్ విక్టోరియా.

అదేమిటో తెలియదు నాకు ఇన్నేళ్ళు వచ్చి, నా కట్టుకున్న భార్యని, రాత్రి అయినా, పగలైనా సరే అంతగా అడగకూడనిది నేను ఏమి అడిగానా అని నాకు అనుమానం వచ్చినా "ఆ ఒక్కటీ అడక్కు" అనే మాట భలే తమాషాగా వినపడింది మా కవి హృదయానికి. ఒక వేళ నా లాగ ఎప్పుడైనా, ఎవరైనా, తెలిసో, తెలియకో "ఆ ఒక్కటీ" అడిగితే ఏమవుతుంది అనే ప్రశ్న కూడా నా బుర్రలో ఉదయించింది. వెనువెంటనే పలు అడగకూడని ప్రశ్నలు, వాటికి చెప్పకుదని సమాధానాలు కూడా తట్టాయి.

"హైదరాబాద్" అని చంద్రబాబు గారు అనగానే "ఆ ఒక్కటీ అడక్కు" అంటారు కె.సీ.ఆర్.

"నదీ జలాలు " అని రాయల సీమ వారు అనగానే ఆ ఒక్కటే అడక్కు అంటారు కృష్ణా జిల్లా వారు.

"ఈ మధ్య టీవీలలో కనపడడం లేదే" అని చిరంజీవినీ, పళ్ళంరాజునీ ని అడగ కూడని ప్రశ్న.

"మీరేం చేస్తూ ఉంటారు" అని తెలియని వారు అడగగానే "ఆ ఒక్కటీ అడక్కు. నాకేం తెలియదు." అంటారు ప్రధాని మన్మోహన్ సింగ్.

"మీ ఒబామా కేర్" వెబ్ సైట్ ఎలా పని చేస్తోంది?" అని అడగగానే "ఆ ఒక్కటీ అడక్కు" అని తెల్ల మొహం వేస్తారు నల్లాయన.

"ఈ మధ్య ఏమన్నా రాశారా?" అని ఏ తెలుగు కవిని అయినా అడిగి చూడండి. అంతే సంగతులు. జన్మలో మళ్ళీ ఏ కవినీ ఆ ప్రశ్న అడగకూడదని అర క్షణంలో తెలిసిపోతుంది.

"బిల్లెంతయింది?" అని కార్పోరేట్ హాస్పిటల్ లో డాక్టర్ ని అడిగిన వాళ్ళు గుండె ఆగి అక్కడే చస్తారు.

"మీ పాఠశాలలో తెలుగు నేర్పుతారా?" అని అడిగితే "నో, వుయ్ ఫాలో సెంట్రల్ గవర్నమెంట్ సిలబస్" అంటాడు ప్రధానోపాధ్యుడు గర్వంగా. అలాంటప్పుడు అడిగీ "అయ్యో" అనుకోవడం ఎందుకు?

"మీ హెచ్ వాన్ వీసా స్పాన్సర్ ఎవరు?" అని అమెరికాలో ఉన్న ఏ ఐటీ కుర్రాడినీ అడక్కండి. తన బావ మరిది పేరు చెప్పలేక ఇబ్బంది పడిపోతాడు పాపం.

"ప్రేమించుకుందాం. వస్తావా?" అని పొరపాటున కూడా తెలుగు సినిమా హీరోయిన్ ని అడక్కండి. "ఆ మాత్రం దానికి అడగాలా?" అనే అవకాశం ఉంది.

ఇలా రకరకాల అడక్కూడని ప్రశ్నలతో నా బుర్ర బద్దలవుతుంటే ఫోన్ మోగింది. ఇంత అర్ధరాత్రి నాకు ఎవరు ఫోన్ చేస్తారా అని భయపడుతూ ఫోన్ తియ్యగానే "ఏం, యింకా పడుకో లేదా?" అని వర్క్ నుంచి మా క్వీన్ విక్టోరియా ఫోన్. నేను ఆశ్చర్యపోయి "అదేమిటీ. ఇప్పుడు ఫోన్ చేసావు. ఎప్పుడు లేనిది. ఆర్యూ ఒకే?" అని అడిగాను కొంచెం ఆశ్చర్యంగా.

"అబ్బే ఏం లేదులే. ఇందాకా "అది" అడిగావుగా. అదేలే... ఏదో పుస్తకాలకి విరాళం అడిగావుగా. ఇస్తానులే. ఏదో కష్టపడుతున్నావుగా. అందుకూ." ఆ గొంతుకలో జాలి తొణికిసలాడింది.

ఇంతకీ అసలు సంగతి ఏమిటంటే 2013 లో సుమారు ఐదు లక్షల రూపాయలు ఖర్చు పెట్టి సాహిత్య కార్యక్రమాలు నిర్వహించాం. మరొక ఐదు లక్షల రూపాయలు పెట్టి నాలుగు తెలుగు పుస్తకాలూ ప్రచురించాం. వీటన్నిటికీ టన్నుల కొద్దీ ప్రశంసలు ఇంకా అందుకుంటూనే ఉన్నాం. కానీ ఎంత ప్రయత్నం చేసినా తగిన విరాళం ఇచ్చి ఈ పుస్తకాలు తీసుకుని నా ఆఫీసు గదిని కాస్త ఖాళీ అవడానికి సాయం చెయ్యండి బాబోయ్ అని ఎంత బతిమాలినా ....అది నా తరం కావడం లేదు. ఎవరి నోట ప్రత్యక్షంగా విన్నా, వినక పోయినా ఒకటే మాట.

**"విరాళమా? ఆ ఒక్కటీ అడక్కు".**

ఆంధ్ర ప్రదేశ్ లో ఎలాగూ లేదు. కానీ అమెరికాలో అసలు ఆ ఒక్కటీ అడగనిదే ఏ పనీ చెయ్యరు. చెయ్య లేరు. పైగా అలా అందరినీ అడుక్కోవడం జాతీయ సిద్ధాంతంగా ప్రకటించి అమెరికా ప్రభుత్వం వారు తమ పన్నుల విధి విధానాలని రూపు దిద్దుకున్నారు." వాటిని కొందరైనా సద్వినియోగం చేసుకుంటే కనీసం వచ్చే ఏడయినా నాకు "పీడ కళ"" రావు కదా అని ఆశిస్తూ అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.

మా బ్లాగ్: www.vangurifoundation.blogspot.com

COMMENTS